

జూన్4న పారా మిలటరీ బందోబస్తు పెట్టాలి

ప్రజాశక్తి-కాకినాడ

జూన్4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడే కౌంటింగ్ ప్రక్రియ జరగనున్న దష్ట్యా కాకినాడ జిల్లా కేంద్రం సిటీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మరింత పటిష్ట బందోబస్తు పారా మిలటరీ దళాలను మోహరించాలని పౌర సంక్షేమ సంఘం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. మే 13న జరిగిన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయినప్పటికీ ఏటిమొగ, ముత్తా నగర్, గోళీలపేట, గౌరీశంకర్ పేట, బుడంపేట, రామకృష్ణారావు పేట ప్రాంతాల్లో జరిగిన సంఘటనలు చిన్నవే అయినప్పటికీ వాటి ప్రభావం ఫలితాల ప్రకటన రోజున తీవ్రంగా ఉండే అవకాశం ఉందని పౌర సంఘం కన్వీనర్ ప్రముఖ సామాజిక వేత్త దూసర్ల పూడి రమణరాజు పేర్కొన్నారు.

ఆదుకోని ఉపాధి హామీ

- పెరుగుతున్న నిత్యావసరాల ధరలు
- ఉపాధి పథకంలో అరకొర వేతనాలే దిక్కు
- రూ.250 మించి రాని వైనం
- రూ.600 చెల్లించాలంటున్న కార్మికులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

గ్రామీణ ప్రాంతాల్లో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పూర్తిస్థాయిలో ఆదుకోలేకపోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యవసరాలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలతో పోల్చుకుంటే వేతనాలు సరిపోని పరిస్థితి నెలకొంది. కేంద్ర ప్రభుత్వం గతంలో రూ.257 గరిష్ట వేతనం ఇచ్చేవారు. దానికి గతేడాది రూ.272కి పెంచారు. ఈ ఆర్థిక సంవత్సరం రూ.300కి మాత్రమే పెంచి చేతులు దులుపుకొన్నారు. సాధారణ రోజుల్లో పొద్దస్తమానూ, వేసవిలో మండుటెండలో పని చేస్తుంటే రూ.200 నుంచి 250 మించి వేతనం అందడం లేదని వ్యవసాయ కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కనీస వేతనంగా రూ.600 చెల్లించే విధంగా చట్టంలో మార్పులు చేయాలని పలువురు కోరుతున్నారు.

కాకినాడ జిల్లాలోని 21 మండలాల్లో 3.42 లక్షల జాబ్ కార్డులు ఉండగా 4,59,414 వేతనదారులు రెగ్యులర్‌గా పనులకు వెళుతున్నారు. ఈ వేసవిలో ప్రస్తుతం సుమారు 80 వేల మంది పనులకు వెళుతున్నారు. కూలీలకు కనీస వేతనాలు అందని పరిస్థితుల్లో కుటుంబాలను పోషించుకునేందుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వంటగ్యాస్ సహా పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుదలతో పాటు ఇంట్లో నిత్యం వాడుకునే బియ్యం, నూనెలు, పప్పులు, కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. రేషన్ బియ్యం ఇంటింటికీ పంపిణీ చేస్తున్నా బియ్యం మాత్రమే ఇస్తున్నారు. గతంలో అరకిలో పంచదార, కిలో కందిపప్పు ఇచ్చేవారు. ఇప్పుడు అవి నిలిపివేశారు. దీంతో బహిరంగ మార్కెట్లలో నిత్యవసరాలను కొనుగోలు చేయాలంటే సామాన్యులకు ఆర్థిక భారం తప్పడం లేదు. పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన వారు మాత్రమే ఉపాధి హామీ పథకం పనులకు వెళుతున్నారు. వారికి అరకొర వేతనాలు మాత్రమే ఇస్తుండడం వల్ల బతుకులను భారంగా గడుపుతున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో గరిష్ట కూలి కూడా వేల మంది కూలీలకు పూర్తిస్థాయిలో అందని పరిస్థితి నెలకొంది. గడచిన ఆర్థిక సంవత్సరంలో సగటు కూలి రూ.234.50 దాటలేదు. అంతక ముందు సంవత్సరం రూ.225.17 దాటలేదు. అధికారులు మాత్రం రూ.250 తగ్గకుండా వేతనం అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆచరణ సాధ్యం కావడం లేదు. గత ఐదేళ్లలో రూ. 235 వేతనం దాటిన సందర్భం కనిపించలేదు. గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లతో సమన్వయం చేసుకుంటూ కూలీలంతా పనులకు హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత ఎపిఒలపై ఉంది. ఇదే విషయం జాబ్ చార్ట్‌లో ప్రధాన అంశంగా ఉంది. కానీ ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదని ఏపీవోలపై ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న గ్రామీణ ప్రాంత కూలీలు

వేతనాలు పెంచాలి



మండుటెండల్లో పనిచేస్తున్నా.. రోజువారీ వేతనం రూ.220 మించి రావడం లేదు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం గరిష్ట వేతనాన్ని రూ.600కు పెంచి ఇవ్వాలి. అడిగిన వారందరికీ అధికారులు పనులు కల్పించాలి.

- నక్కా కామరాజు, ఉపాధి కూలీ, అల్లిపూడి, కోటనందురు మండలం.

అందరికీ పనులుండాలి



గ్రామాల్లో ఎక్కువ శాతం వ్యవసాయ పనులను రైతులు యంత్రాల ద్వారా చేపడుతున్నారు. నానాటికీ పనులు తగ్గిపోతున్నాయి. ఇప్పుడిస్తున్న వేతనం ఏమాత్రం సరిపోవడం లేదు. ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి.

- పెండం చక్రరావు, ఉపాధి కూలీ, కరప

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం

ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. అడిగిన వారందరికీ పనులు కల్పించడం లేదు. పెద్ద ఎత్తున నిత్యవసరాలు పెరుగుతున్నా కూలీలకు మాత్రం అరకొర వేతనమే అందుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం కనీస కూలీ రూ.600 ఇవ్వాలి.

- టేకుమూడి ఈశ్వరరావు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు.

ఇవిఎం స్ట్రాంగ్ రూమ్స్ భద్రత పరిశీలన

ప్రజాశక్తి-కాకినాడ

జెఎన్‌టియులో భద్రపరిచిన ఇవిఎం స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత, నిఘా వ్యవస్థ, ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఏర్పాట్లను శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్, ఎస్‌పి ఎస్.సతీశ్ కుమార్ ఇతర ఎన్నికల అధికారులతో కలిసి పరిశీలించారు. కాకినాడ పట్టణ నియోజకవర్గానికి సంబంధించి జెఎన్‌టియుకె సివిల్ ఇంజినీరింగ్ బ్లాకు వద్ద ఉన్న ఇవిఎంల స్ట్రాంగ్ రూము, ఓట్ల లెక్కింపు నిమిత్తం చేసిన ఏర్పాట్లను ఆయన పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కాకినాడ పట్టణ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ జె.నివాస్

తాగునీరు అందించాలని కలెక్టర్‌కు వినతి

సామర్లకోట : పట్టణ ప్రజలకు ఆరోగ్య కరమైన రక్షిత మంచినీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్‌కు జిల్లా మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ శుక్రవారం వీడియో మెసేజ్ ద్వారా వినతి పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 రోజులుగా మున్సిపాలిటీ కులాయిల ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు ఆకు పసరుగా, సుద్ధనీరుగా వస్తున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఈ నీరు తాగిన ప్రజలు లివర్ సంభంధిత వ్యాదులతో, కామెర్లు, విరోచనాలతో ఆసుపత్రుల పాలవుతున్నారన్నారు.

రెండో రోజు ప్రశాంతంగా ఎపిఇఎపి సెట్

ప్రజాశక్తి-కాకినాడ

జెఎన్‌టియుకె కాకినాడ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎపి ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎపిఇఎపిసెట్)-2024 ఆన్లైన్ ప్రవేశ పరీక్ష రెండవ రోజు మే 17వ తేదీ శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా, హైదరాబాద్‌లో ప్రశాంతంగా జరిగినట్లు ఎపిఇఎపి సెట్ చైర్మన్, విసి ప్రొఫెసర్ జివిఆర్.ప్రసాదరాజు తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి సంబంధించి రెండవ రోజు శుక్రవారం ఉదయం 22,221 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 20,226 మంది పరీక్షకు హాజరయ్యారని, 1995 మంది గైర్హాజరైనట్లు సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. మొత్తం 91.02శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 22,400 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 20,654 మంది పరీక్షకు హాజరయ్యారని, 1746 మంది గైర్హాజరు కాగా మొత్తం 92.21 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. మొత్తంగా 44,621 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 40,880 మంది పరీక్షకు హాజరయ్యారని, 3741మంది గైర్హాజరు కాగా 91.62శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. కాకినాడ జిల్లాలో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి సంబంధించి రెండో రోజు శుక్రవారం ఉదయం 920 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 829 మంది పరీక్షకు హాజరయ్యారని, 91 మంది గైర్హాజరయ్యారని కన్వీనర్ ప్రొఫెసర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. మొత్తం 90.11శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 927 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 852 మంది పరీక్షకు హాజరయ్యారని, 75 మంది గైర్హాజరు కాగా మొత్తం 91.91 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. మొత్తంగా 1,847 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 1,681 మంది పరీక్షకు హాజరయ్యారని, 166 మంది గైర్హాజరు కాగా 91.01శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు కన్వీనర్ ప్రొఫెసర్ కె.వెంకటరెడ్డి తెలిపారు.

వేసవి శిబిరంలో సైన్స్ ప్రయోగాలపై శిక్షణ

ప్రజాశక్తి-పెద్దాపురం


చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో యాసలపు సూర్యారావు భవనంలో బాలలకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో శుక్రవారం జనవిజ్ఞాన వేదిక సైన్స్ అండ్ టెక్నాలజీ జిల్లా కన్వీనర్ బుద్దా శ్రీనివాస్ విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై శిక్షణ ఇచ్చారు. పలు ప్రయోగాలను విద్యార్థులతో చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యజీవితంలో జరిగే ప్రతి పని వెనుక సైన్స్ సూత్రాలు ఆధారపడి ఉంటాయన్నారు. దుంగల పూజితా సూర్యశ్రీ కరాటేలో, నీలపాల కృష్ణ కర్రసాములో, ఫన్ మ్యాథ్స్‌లో జెవివి వర్మ, క్రాఫ్ట్‌లో అన్నపూర్ణ, రేవతి శిక్షణ ఇచ్చారు. శ్యామ్ కుమార్ స్వామి డ్రాయింగ్‌లో శిక్షణ ఇచ్చారు. కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్ కుమార్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో దారపు రెడ్డి కృష్ణ, అమత, నమ్రత, సిరిజ, మంజుల, సత్య, సాయి, అభిరామ్, మణికంఠ, పవన్, వివేక్, బంగారం, నేహా లక్ష్మి, రేణుక, శ్రీజ పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం

ప్రజాశక్తి-గండేపల్లి

మురారి గ్రామంలో గోవిందమాంబ సమేత శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా ఘనంగా గురు పూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని భజన కార్యక్రమాలు నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కార్టూన్ 'నిజం'



బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షునిగా కొర్లమండ

ప్రజాశక్తి - సామర్లకోట

కాకినాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షునిగా సామర్లకోటకు చెందిన ప్రముఖ న్యాయవాది కె.వీరభద్రరావు మూడోసారి ఎంపికై హ్యాట్రిక్ సాధించారు. 2024-25 ఏడాదికి జరిగిన ఈ ఎన్నికల్లో అర్హులైన 980 మంది ఓటర్లకు గాను 680 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కెవి భద్రరావుకు 440 ఓట్లు రాగా, ప్రత్యర్థి సూదిన శ్రీనివాస్‌కు 237 ఓట్లు వచ్చాయి. మూడు ఓట్లు అనర్హత ఓట్లుగా పరిగణించారు. భద్రరావు 223 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. భద్రరావు 2020-21లో ఉపాధ్యక్షునిగా పనిచేశారు. 2023-24, 2024 కాకినాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షునిగా ఎంపికయ్యారు. 2024 25 ఏడాదికి జరిగిన ఈ ఎన్నికల్లో అర్హులైన 980 మంది ఓటర్లకు గాను 680 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కెవి భద్రరావుకు 440 ఓట్లు వచ్చాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట పట్టణ పరిధిలోని 33/11 కెవి విద్యుత్ లైన్ మరమ్మత్తుల కారణంగా సామర్లకోట సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కెవి అన్నపూర్ణమ్మ ఫీడర్‌కు విద్యుత్ సరఫరాను శనివారం నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఆపరేషన్స్ ఇఇ ఎబిఎన్‌డిఎస్.ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకూ పట్టణంలోని బళ్ల మార్కెట్, విఘ్నేశ్వర థియేటర్, వీరాఘవాపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ సహకరించాలని ఇఇ ప్రభాకర్ కోరారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యాన యోగా కేంద్రం

ప్రజాశక్తి-కాకినాడ

నగర పరిధిలో వివేకానంద పార్క్ ప్రాంగణంలోని రెడ్ క్రాస్ యోగా కేంద్రంలో మే 1న ప్రారంభించిన పిల్లల వేసవి యోగా శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకట రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గతంలో వేసవి సెలవుల్లో కుటుంబంలో పెద్దవాళ్లు చెప్పే కథలు, పురాణాలతో బాగా గడిచేవన్నారు. ఇప్పుడు సెల్ ఫోన్, ఇంటర్నెట్ ప్రభావం పిల్లలపై చెడు ప్రభావం చూపకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లితండ్రులపై ఉందని తెలిపారు. పిల్లలకు మానసిక, ఆధ్యాత్మిక, శారీరక ఆరోగ్యాన్ని అందించే ఇటువంటి వేసవి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినందుకు రెడ్ క్రాస్ చైర్మన్ వైడి.రామారావును, శిక్షకులను అభినందించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ రామారావు మాట్లాడుతూ ఈ వేసవి శిక్షణా శిబిరాన్ని 2017 నుంచి నిరాటంకంగా నిర్వహిస్తూ పిల్లల మానసిక వికాసానికి ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం 60 మంది బాల బాలికలు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్నారని తెలిపారు. ఈ శిక్షణా శిబిరంలో వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చిన శిక్షకులను కమిషనర్ సత్కరించి, పిల్లలకు బహుమతులు, ధ్రువపత్రాలు అందచేశారు. పిల్లల తల్లిదండ్రులు శిక్షణా తరగతుల నిర్వహణపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్యదర్శి కె.శివ కుమార్, సంస్థ సభ్యులు పి.పద్మజా వాణి, సుశి, సచ్చిదానంద యోగి, యోగా శిక్షకులు శ్రీనివాస్ పల్లవి పాల్గొన్నారు.



ధ్రువపత్రాలు అందజేస్తున్న కమిషనర్ జె.వెంకటరావు

వివిధ విభాగాలపై ట్రైనీ కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-కాకినాడ

ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్.భావన శుక్రవారం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలోని వివిధ విభాగాధిపతులతో సమావేశమయ్యారు. కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకటరావు అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా కార్యకలాపాలను సమీక్షించారు. ట్రైనీ కలెక్టర్ హోదాలో విభాగాల వారీగా ఆయా శాఖల పనితీరు, విధి విధానాలు, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఎస్ఇ పి.సత్య కుమారి, స్మార్ట్ సిటీ ఎస్ఇ పి.వెంకటరావు, ఇఇ మాధవి, ఎంహెచ్ఒ డాక్టర్ పథ్వీ చరణ్, డిసిపి హరిదాస్, ఎసిపి నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఎఒ శిరీష్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో ట్రైనీ కలెక్టర్ భావన

ట్రిపుల్ ఐటికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - సామర్లకోట

రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌టియుకెటి) పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలులోని ట్రిపుల్ ఐటిల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఆరేళ్ల పాటు బిటెక్ సమీకత ఇంజినీరింగ్ కోర్సులో ప్రవేశాలకుగాను వర్సిటీ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంఇఒ వై.శివ రామకృష్ణయ్య తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. దీనికి సంభందించి ఈ నెల 6న నోటిఫికేషన్ విడుదల అయినట్టు తెలిపారు. ఒక్కో సెంటర్‌లో వెయ్యి సీట్లు ఉన్నాయని, ఇడబ్ల్యుఎస్ కోటాలో మరో వంద సీట్లు ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ కోర్సులో చేరేందుకు దరఖాస్తులను ఈ నెల 8వ తేదీ నుంచి నుంచి జూన్ 25వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తారన్నారు. ప్రవేశాల్లో ఎస్‌సిలకు 15 శాతం, ఎస్‌టిలకు 6 శాతం, బిసి-ఎకు 7 శాతం, బిసి-బికి 10 శాతం, బిసి-సికి 1శాతం, బిసి-డికి 7 శాతం, బిసి-ఇకి 4 శాతం చొప్పున రిజర్వేషన్ అమలు చేస్తారన్నారు. ప్రత్యేక సీట్ల కింద వికలాంగులకు 5శాతం, సైనికోద్యోగుల పిల్లలకు 2 శాతం, ఎన్‌సిసి విద్యార్థులకు 1 శాతం, స్పోర్ట్స్ కోటా కింద 0.5 శాతం, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటా కింద 0.5శాతం సీట్లను భర్తీ చేస్తారన్నారు. ప్రతి కేటగిరీలోనూ 33.33 శాతం సీట్లను సమాంతరంగా బాలికలకు కేటాయిస్తారన్నారు.

అభ్యర్థులు ప్రథమ ప్రయత్నంలోనే 2024లో ఎస్ఎస్‌సి లేదా తత్సమాన పరీక్షలో రెగ్యులర్ విద్యార్థిగా ఉత్తీర్ణులై ఉండాలన్నారు. వయస్సు 2024 డిసెంబర్ 31 నాటికి 18 ఏళ్లు నిండకుండా ఉండాలని, ఎస్‌సి, ఎస్‌టి కేటగిరీ అభ్యర్థులకైతే 21 ఏళ్లు నిండకుండా ఉండాలని తెలిపారు. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా మెరిట్ పద్ధతిలో ప్రవేశాలు కల్పిస్తారని, నాన్ రెసిడెన్షియల్ ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ హైస్కూల్‌కు, మున్సిపల్ హైస్కూల్లో చదివిన విద్యార్థులకు వారి మార్కులకు 4 శాతం డిప్రెవేషన్ స్కోర్‌ను అదనంగా కలుపుతారని ఆయన తెలిపారు. దీన్ని సాంఘికంగా, ఆర్థికంగా వెనకబాటుకు గురైన విద్యార్థులకు ఇచ్చే వెయిటేజీగా ఆయన పేర్కొన్నారు. 85 శాతం సీట్లను స్థానికంగా, మిగిలిన 15శాతం సీట్లను మెరిట్ కోటాలో తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు కేటాయిస్తారన్నారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని ఆయన తెలిపారు.

19 నుంచి కురంగేశ్వర స్వామి కల్యాణోత్సవాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని కోరంగి పంచాయతీ పాతకోరంగిలో ప్రసిద్ధ దేవాలయమైన కురంగేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీబాలా త్రిపుర సుందరి సమేత కురంగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాలు ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఇఒ కెవి.వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా 19వ తేదీ ఆదివారం రాత్రి 7 గంటలకు దివ్య కళ్యాణము, అదే రోజు రాత్రి గంటలు 8:30 నుంచి మహా అన్నదానం నిర్వహిస్తామన్నారు. 21వ తేదీ మంగళవారం సదస్యమహోత్సవం, 23న త్రిశూల స్నానం, అదే రోజు రాత్రి 7 గంటలకు తెప్పోత్సవము, 24వ తేదీ శుక్రవారం రాత్రి 7 గంటల నుంచి శ్రీ పుష్ప యోగోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

స్ట్రాంగ్ రూమ్ సందర్శించిన ఆర్ఒ

ప్రజాశక్తి-కాకినాడ

పిఠాపురం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి శుక్రవారం జెఎన్‌టియులోని అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలో ఏర్పాటు చేసిన ఇవిఎంలు, ఇతర ఎన్నికల సామాగ్రి భద్రపరిచిన స్ట్రాంగ్ రూమును సందర్శించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల అధికారులతో కలిసి స్ట్రాంగ్ రూముకు వెళ్లి అక్కడి భద్రతా ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు.

సుబ్బలక్ష్మి నేత్రాల దానం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పి.మల్లవరం పంచాయతీకి చెందిన ఉంగరాల సుబ్బలక్ష్మి (55) శుక్రవారం ఉదయం అకస్మికంగా మరణం చెందారు. ఆమె కుటుంబ సభ్యులు రాజా, రాజేశ్వరితో సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ (బాబి) సంప్రదించి సుబ్బలక్ష్మి కార్నియాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు అందజేశారు. ఐ బ్యాంక్ సిబ్బంది రవి కార్నియాలను సేకరించారు. ఈ సందర్భంగా సుబ్బలక్ష్మి కుటుంబ సభ్యులను యర్రా చిట్టిస్వామి, అందే బాబి పరామర్శించారు.

వేసవి శిక్షణా తరగతుల ముగింపు

ప్రజాశక్తి-పిఠాపురం

సహదయ మిత్ర మండలి ఆధ్వర్యంలో స్థానిక శ్రీ సూర్యరాయ గ్రంథాలయంలో రెండు వారాలుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు సభకు చక్రధర్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెన్నపు చక్రధరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 24 ఏళ్లుగా క్రమం తప్పక ప్రతి వేసవిలోనూ ఉచిత వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్న సహృదయ మండలి సభ్యులను అభినందించారు. ఈ సంవత్సరం పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో పిఠాపురం పట్టణ పరిధిలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు బాలికలను ఆయన సత్కరించారు. అనంతరం సహదయ మిత్రమండలి సభ్యులు చక్రధర రావు, గ్రంథాలయ ప్రధాన కార్యదర్శి కొండేపూడి శంకరరావు, శిక్షణ తరగతుల ప్రిన్సిపల్ పోతుల శ్రీనివాసును, ఉపాధ్యాయులు కామరాజును మిత్రమండలి ప్రధాన కార్యదర్శి సిహెచ్.సతీష్, మహిళా కార్యదర్శి పి.పావనిని ఘనంగా సత్కరించారు.శిక్షణ పొందిన 70 మంది విద్యార్థులకు భాష్యం పాఠశాల ప్రిన్సిపాల్ వేణు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తోట శ్రీనివాసరావు, వివి,సత్యనారాయణ రెడ్డి, శ్రీకష్ణ దేవరాయలు, వరద వీరభద్రరావు, మేకా మన్మధరావు, దాడి పద్మనాభం, ఉమా మంగతాయారు, కరుణ కుమార్, గంగబాబు, తోట నాగేంద్ర ప్రసాద్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాలతో విద్యార్థిని విద్యార్థులు

నాడు-నేడు పనులు వెంటనే పూర్తి చేయండి

ప్రజాశక్తి -సామర్లకోట

మండల పరిధిలో నాడు-నేడు పేస్- 2 పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నాడు-నేడు ఫేజ్-2 పాఠశాల హెచ్ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు, సిఆర్‌పిలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి-1 వై.శివరామకష్ణయ్య. మండల విద్యాశాఖ అధికారి-2 పి.పుల్లయ్య మాట్లాడుతూ ఈనెలాఖరు నాటికి అన్ని పాఠశాలలో నాడు నేడు పనులు పూర్తి చేయాలని తెలిపారు. డిఇఒ ఇటీవల నిర్వహించిన సమీక్షా సమావేశం పనులు పూర్తయిన బిల్లులు అప్లోడ్ చేయని కారణంగా పనులు పూర్తి కాలేనట్టుగా సమాచారం ఉందని తెలిపారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సిఆర్‌పిల సాయంతో వెంటనే ఫోటోలు అప్లోడ్ చేసి పనులు పూర్తి చేయాలన్నారు. మే నెల నాటికి హెచ్ఎంలు అందుబాటులో ఉండాలని తెలిపారు.

నేరాలు ఘోరాలు



ఘటనా స్థలంలో మృతి చెందిన నాగరాజు

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

ప్రజాశక్తి-ఆలమూరు

216వ నెంబర్ జాతీయ రహదారిపై మండలంలోని మూలస్థాన అగ్రహారం డివైడర్ వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ ఎల్.శ్రీను నాయక్ తెలిపిన వివరాలు ప్రకారం.. ఆత్రేయపురం మండలం ర్యాలీకి చెందిన బర్రె నాగరాజు (25) ద్విచక్ర వాహనంపై రావులపాలెం వైపు నుంచి మూలస్థాన అగ్రహారం ఇందిరా కాలనీకి వస్తున్నాడు. ఈ క్రమంలో మూలస్థాన అగ్రహారం వద్ద డివైడర్ దాటుతున్నాడు. ఇంతలో రాజమహేంద్రవరం నుంచి రావులపాలెం వెళుతున్న కారు ద్విచక్ర వాహనాన్ని వేగంగా ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలైన నాగరాజు సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

జనసేన పార్టీ కార్యాలయంలో ఫర్నీచర్ అపహరణ

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ముమ్మిడివరం జనసేన పార్టీ కార్యాలయంలో ఫర్నీచర్‌ను ముగ్గురు వ్యక్తులు దొంగలించిపోయారని ఆ భవన యజమానులు చొడపనీడి బాలకృష్ణ, చొడపనీడి చక్రధర్ రావు శుక్రవారం ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని టిటిఆర్ నగర్‌లోని తమకు చెందిన ఖాళీ స్థలంలో జనసేన పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసుకునేందుకు 2019 జనవరి 21వ తేదీన సిహెచ్ గున్నేపల్లి గ్రామానికి చెందిన గొల్లకోటి వెంకటేశ్వరరావు ఒక సంవత్సర కాలానికి లీజు ఒప్పందం కుదుర్చుకున్నాడని, అయితే వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందాడని, అప్పటినుండి తమకు ఏ విధమైన అద్దె చెల్లించడం లేదన్నారు. 15వ తేదీ బుధవారం రాత్రి ముగ్గురు వ్యక్తులు కార్యాలయంలోని కుర్చీలు, ఏసీలు, బల్లలు, ఫ్యాన్లు మరియు ఇతర సామగ్రిని దొంగలించుకుపోయారని దీనిపై విచారణ నిర్వహించి దొంగతనానికి పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వారు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



అచీవర్స్ డేలో పాల్గొన్న విద్యార్థులు

'ఆదిత్య'లో ఘనంగా ఎచీవర్స్ డే

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య విద్యా ప్రాంగణంలో 2023-24 విద్యా సంవత్సరంలో ఫైనల్ ఇయర్ పాలిటెక్నిక్ చదువుతుండగానే వివిధ కంపెనీల్లో ప్లేస్‌మెంట్స్ సాధించిన అన్ని బ్రాంచ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆదిత్య కళాశాలల ప్రిన్సిపల్ ఎస్‌టివివిఎస్.కుమార్ మాట్లాడుతూ ఆదిత్య పాలిటెక్నిక్‌లో చేరిన ప్రతి విద్యార్థి కోర్స్ ముగిసే నాటికి పాలిటెక్నిక్ సర్టిఫికెట్‌తో పాటు ఒక చేతిలో 2 లేదా 3 కంపెనీలలో ఉద్యోగం, మరో చేతిలో మంచి ఈసెట్ ర్యాంకుతో బయటకు వెళ్ళాలనేది తమ లక్ష్యమన్నారు. దాన్ని నిజం చేస్తూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా థాట్ వర్క్, ఎబిబి, హిందూజా, వంటి 15 పైగా ప్రముఖ బహుళజాతి కంపెనీలలో ఇప్పటి వరకు దాదాపు 600 మంది విద్యార్థులు రూ.8 లక్షలు, రూ.4.75 లక్షల వార్షిక వేతనం గల ఉద్యగాలు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చివరిగా ఉద్యోగాలు సాదించిన ప్రతి బ్రాంచ్ విద్యార్థులకు ప్లేసెమెంట్ ఉత్తర్వుతో పాటు సర్టిఫికెట్ బహుకరించారు. ఈ సమావేశంలో డీన్ ఎవి.మాధవరావు, వివిధ విభాగాధిపతులు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.



వార్డులో తవ్వి వదిలేసిన గోతులు

ప్రమాదకరంగా పైప్ లైన్ గోతులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం పట్టణ పరిధిలోని 23వ వార్డులో మంచినీటి పైప్ లైన్లు మరమ్మతుల కోసం తవ్విన గోతులను పూడ్చకుండా వదిలేశారు. ఇక్కడ గల గుండప్ప వారి సందు ఎదురుగా మునిసిపాలిటీ తాగునీటి విభాగం మంచి నీటి పైపులైన్ మరమ్మతుల నిమిత్తంగా గొయ్యి తవ్వారు. దాదాపుగా పది రోజులు అయినా పైపులై ను మరమ్మతు పూర్తి చేయలేదు. దీనితో నీరు లీక్ అవుతూనే ఉంది. రోడ్డు పక్కనే ఉన్న ఈ గొయ్యి నిత్యం వాహనాలు రాకపోకలతో రద్దీగా ఉండే దారిలో ఇబ్బందికరంగా ఉంది. పక్కనే ఉన్న డ్రయినేజీ నీళ్ల ఆ గోతిలోకి వెళుతున్నాయి ఆ నీళ్లే లీకేజీ ద్వారా మంచినీటి పైపుల నుండి ఇళ్లకు కూడా వెళుతున్నాయనీ, సంబంధిత అధికారులు మున్సిపల్ కమిషనర్ ఈ విషయంపై దష్టి సారించి సమస్యను పరిష్కరించాలని వార్డు ప్రజలు కోరు తున్నారు.

నత్తనడకన ఫ్లయ్ ఓవర్ నిర్మాణం

- జొన్నాడ ఫ్లయ్ ఓవర్ నిర్మాణం
- పనులతో తరచూ ప్రమాదాలు
- ప్రయాణికులకు నిత్యం యాతన
- పట్టించుకోని హైవే అధికారులు

ప్రజాశక్తి - ఆలమూరు

216ఏ జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణకు, తద్వారా ప్రయాణికుల ఇబ్బందుల పరిష్కారానికి అధికారులు పలుచోట్ల ఫయ్ ఓవర్ నిర్మాణాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం లోని మోరంపూడి వద్ద, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలోని జొన్నాడ వద్ద ఫ్లయ్ ఓవర్ల నిర్మాణానికి గత ఏడాది జనవరిలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపన చేశారు. వచ్చే ఏడాది జనవరికి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన ప్రకటించారు. ఈ రెండింటిలో మోరంపూడి వద్ద పనులు శరవేగంగా జరుగుతు దాదాపుగా ఫ్లయ్ ఓవర్ నిర్మాణం పూర్తి కాగా, అప్రోచ్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో మోరంపూడి ఫ్లయ్ ఓవర్ రెండు, మూడు నెలల్లో అందుబాటులోకి రానుంది.

కానీ ఆలమూరు మండలంలోని జొన్నాడ వద్ద ఫ్లయ్ ఓవర్ పనులు ప్రారంభించినప్పటికీ, గుత్తేదారు అలసత్వంతో నత్తనడకన కొనసాగుతున్నాయి. రెండు ఫ్లయ్ ఓవర్ల వద్ద పనులు బేరీజు వేసుకుంటే మోరంపూడి వద్ద పనులు పూర్తి కావస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. కానీ జొన్నాడ వద్ద ఇంకా పిల్లర్లే పూర్తిగా అని పరిస్థితి నెలకొంది. ఈ జొన్నాడ ఫ్లయ్ ఓవర్ పై ఎందుకంత వివక్ష చూపుతున్నారో అర్థం కావడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఫ్లయ్ ఓవర్ నిర్మాణ పనులతో గత ఏడాదిన్నరగా జొన్నాడ సెంటర్ వద్ద ప్రమాదాలకు నిలయంగా మారింది. ఫ్లయ్ ఓవర్ పనుల పేరుతో ఎటువంటి నియమ, నిబంధనలు పాటించకుండా వదిలేయడంతో తరచు అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో పలువురు మత్యువాత పడగా, అనేకమంది క్షతగాత్రులుగా మిగులుతున్నారు. అయినప్పటికీ హైవే అధికారులు నిర్లక్ష్య ధోరణిలో ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదు. డివైడర్ దాటే క్రమంలో రోడ్డు ఒక పక్క నుంచి మరొక పక్కకు వెళ్లడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. ఇక పిల్లర్ల నిర్మాణానికి ఏడాది పట్టిందంటే మిగిలిన పనులు ఎంత నత్తనడకన సాగనున్నాయో అర్థం చేసుకోవచ్చునని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలమూరు మండలంలోని అనేక గ్రామాల వారికి జొన్నాడ సెంటర్ ముఖ్య కూడలి. నిత్యం వందలాదిమంది ఇక్కడకు చేరుకొని రాజమహేంద్రవరం, విజయవాడ తదితర దూర ప్రాంతాలకు ప్రయాణిస్తూ ఉంటారు. కనీసం ప్రయాణికులకు బస్సు షెల్టర్ కూడా ఏర్పాటు చేయలేదు. నిర్మాణం పేరు చెప్పి ఉన్న బస్సు షెల్టర్లు పూర్తిగా తొలగించి సర్వీసు రోడ్డు వేశారు. దీంతో సుమారు 15 నెలలుగా ప్రయాణికులు ఎండైనా, వానైనా బస్సుల కోసం రోడ్డు మీదే నిరీక్షించాల్సి వస్తోంది. ఇక సర్వీసు రోడ్డుపై ట్రాఫిక్ ఇబ్బందులతో బస్సులను ఎక్కడ ఆపుతున్నారో ప్రయాణికులకు అర్థం కావడం లేదు.

దీంతో వృద్ధులు, వికలాంగులు, మహిళలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. జొన్నాడ సెంటర్ వద్ద పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే హైవే అధికారులు సోజ్యం చూస్తూ కాలం వెళ్లబుచ్చుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఫ్లయ్ ఓవర్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



జొన్నాడ సెంటర్ ఫ్లైఓవర్ నిర్మాణ దశలో ఉన్న పిల్లర్లు



నత్తనడకన సాగుతున్న అప్రోచ్ రోడ్డు పనులు


నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి



అనునిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే జొన్నాడ సెంటర్ వద్ద ఫ్లయ్ ఓవర్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. మా తోటి ప్రయాణికులు ఇప్పటికే పలువురు ప్రమాదాల బారిన పడ్డారు. ఇకనైనా అధికారులు స్పందించి నిర్మాణం పూర్తి చేసేందుకు చొరవ చూపాలని కోరుతున్నా.

-రాయుడు వెంకటేష్, చెముడులంక

నియంత్రణ లేని ట్రాఫిక్‌తో ప్రమాదాలు



జొన్నాడ సెంటర్ వద్ద ఫ్లయ్ ఓవర్ నిర్మాణ పనుల నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణకు సరైన సూచికలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సంబంధిత గుత్తేదారుతో సమీక్ష నిర్వహించి, పనులు పూర్తయ్యేందుకు తక్షణ చర్యలు తీసుకుని, ప్రయాణికుల అవస్థలకు అడ్డుకట్ట వేయాలి. ఇకనైనా హైవే అధికారులు స్పందించి ఫ్లయ్ ఓవర్ నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలి.

-దూలం రాంబాబు, బడుగువానిలంక

సాదా సీదాగా మండల సమావేశం

ప్రజాశక్తి-గండేపల్లి

మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపిడిఒ హనుమంతరావు ఆధ్వర్యంలో ఎంపిపి చలగళ్ల దొరబాబు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా, జెడ్‌పిటిసి సభ్యులు పరిమి వెంకట లక్ష్మీ బాబు, వైస్ ఎంపిపి పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న అధికారులతో సమస్యలు చెప్పమని తెలపడంతో ఎక్కువగా ఆయా మండల కార్యాలయాలకు సంబంధించిన ప్రహరీ గోడ తదితరు సమస్యలను మండల స్థాయి అధికారులు వివరించారు. ఉప్పలపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ అడబాల ఆంజనేయులు మాట్లాడుతూ తమ గ్రామంలో తాగునీరు బోరు పాడైందని వెంటనే రిపేరు చేయించాలని కోరారు. మురారి గ్రామానికి సంబంధించి ఎంపిటిసి సభ్యురాలు మాట్లాడుతూ తమ గ్రామంలో ఐసిడిఎస్ బాలింతలకు ఇవ్వాల్సిన పౌష్టికాహారాలు సంబంధించిన సమస్యలు లేవనెత్తారు. సిడిపిఒ అధికారి పూర్ణిమ ఆ సమస్యను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల కోడ్ ఉన్నందున తీర్మానాలు చేయడం జరగదని ప్రస్తుతం సమస్యలపై సమీక్ష నిర్వహిస్తామని ఎంపిడిఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి బిఎస్ఎన్.మూర్తి, ఆయా గ్రామ సర్పంచులు అడబాల ఆంజనేయులు, జాస్తి వసంత్, మద్దిపట్ల రామకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విఎస్ఎన్ మూర్తి

19న పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి

ప్రజాశక్తి-కాకినాడ

దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, పీడిత ప్రజల ప్రియతమ నేత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి ఈ నెల 19న ఆదివారం ఉదయం 9 గంటలకు కాకినాడ కచేరిపేట సుందరయ్య భవన్‌లో నిర్వహిస్తామనిసిపిఎం నగర కమిటీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం సిపిఎం నగర కమిటీ సభ్యులు కె.సత్తిరాజు మాట్లాడుతూ సుందరయ్య జీవితంలో ఉద్యమం, పోరాటం, త్యాగంతో పాటు నిరంతరం ప్రజా సేవ కూడా ముడిపడి ఉందన్నారు. ఆయన స్ఫూర్తితో ఆయన వర్ధంతి సందర్భంగా ఉన్నంతలో సాయం ఉన్నంత వరకు చేద్దాం అనే కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. నగరంలో ఎవరైనా తమ ఇళ్లలో ఉపయోగించని, అవసరానికి మించి అదనంగా ఉన్నవి ఏవైనా దుస్తులు, గిన్నెలు, పుస్తకాలు, ఇతర వస్తువులు 18వ తేదీ సాయంత్రం లోపు కచేరిపేట సుందరయ్య భవన్‌లో అందించాలని కోరారు. 19వ తేదీ ఉదయం సుందరయ్య వర్ధంతి సందర్భంగా వాటిని అవసరమైన వారికి అందచేస్తామన్నారు. వివరాలకు 9490098974 నెంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.సత్తిరాజుతో పాటు సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నగర కమిటీ సభ్యుడు మలక వెంకట రమణ పాల్గొన్నారు.



దుస్తులను సేకరిస్తున్న సిపిఎం నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి హనుమంతరావు

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

ప్రజాశక్తి-పిఠాపురం

గ్రామంలో శాంతి భద్రతలకు భంగం కలగకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని డిఎస్‌పి కె.హనుమంతరావు అన్నారు. శుక్రవారం మండలంలోని విరవాడ గ్రామంలో గ్రామ పెద్దలు, యువత, పలు పార్టీల కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ రోజున విరవాడ గ్రామంలోని జరిగిన చిన్న చిన్న గొడవల నేపథ్యంలో శాంతిభద్రతలకు భంగం కలిగించకుండా గ్రామంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కౌంటింగ్ కూడా ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని కోరారు. సెక్షన్ 144, 30 పోలీస్ యాక్ట్, ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందున గుంపులు గుంపులుగా తిరగరాదని, సమావేశాలు కానీ, సభలు ఏర్పాటు చేయరాదన్నారు. కౌంటింగ్ అనంతరం విజయోత్సవ ర్యాలీలు పర్మిషన్ లేకుండా నిర్వహించరాదన్నారు. గతంలో ఎన్నికల కేసులు ఉన్న వ్యక్తులను, లా అండ్ ఆర్డర్ కేసుల్లో ఉన్న వ్యక్తులను బైండోవర్ చేశామన్నారు. ప్రతి ఒక్కరూ సతప్రవర్తనతో కలిగి ఉండాలని విద్యార్థులు మంచిగా చదువుకొని తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు ప్రతిష్ట తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో సిఐ శ్రీనివాస్, రూరల్ ఎస్ఐ గుణశేఖర్, పట్టణ ఎస్ఐ మురళి మోహన్ పాల్గొన్నారు.

'అపోలో' ఆధ్వర్యంలో నర్సుల దినోత్సవం

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక డీ కన్వెంక్షన్ హాల్లో కాకినాడ అపోలో ఆసుపత్రి ఆధ్వర్యంలో నర్సుల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహిచారు. దీనికి ముఖ్య అథిదిగా అపోలో హాస్పిటల్స్ రీజినల్, ఇంటెర్నేల్టిన్ సిఇఒ వై.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. లేడి విత్ ది లాంప్ గా పేరు గాంచిన ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని నర్సెస్ డే గా ప్రతి సంవత్సరం నిర్వహిస్తారు. ఈ సంవత్సరం నర్సెస్ డే యొక్క నేపథ్యం ఏమనగా మా నర్సులు మా భవిష్యత్తు ఈ నేపథ్యాన్ని పురస్కరించుకొని అపోలో హాస్పిటల్స్ కాకినాడ వారు నర్సెస్ డే ని నిర్వహించారు. ఈ కార్యక్రమాంలో సిఇఒ వై. సుబ్రమణ్యం మాట్లాడుతూ నర్సులు ఆసుపత్రులకు వెన్నెముక లాంటి వారని పేర్కొన్నారు. ఏ ఆసుపత్రిలో అయినా నర్సులు ముఖ్య పాత్ర వహిస్తారన్నారు. వారు తమ ముఖంలో చిరునవ్వు చెక్కు చెదరకుండా అనారోగ్య సమసమ్యతో వచ్చిన వారందరికీ సేవలు అందిస్తారని పేర్కొన్నారు. ఒక్క రోగి ఆసుపత్రికి రోగనివారణ కోసం వచ్చినపుడు వారిని జాగ్రతగా చేసుకుంటూ రోగికి కావలసిన మందులు, ఆహారం ఇవ్వడం, సమయాను కూలంగా అవసరమైన సేవలు నర్సులు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ హెడ్ ఐవి. రమణ మాట్లాడుతూ రోగులకు వైద్యులు ఇచ్చే ఔషధం ఎంత ముఖ్యమో, నర్సులు చేసే సేవలు కూడా అంతే ముఖ్యమన్నారు. రోగులే తమ పిల్లలుగా భావిస్తూ నర్సులు సేవలు అందిస్తారన్నారు. అటు డాక్టర్లకు, ఇటు రోగులకు వాళ్లు నిత్యం అందుబాటులో ఉంటారన్నారు. ఆస్పత్రుల్లో నర్సులు చేసే పని ఎంతో కీలకమైనదన్నారు.



కేకును కట్ చేస్తున్న ఆసుపత్రి సిబ్బంది

తాండవపై వంతెన కోసం నిరీక్షణ

ప్రజాశక్తి-కోటనందూరు

ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నప్పటికీ తాండవ నదిపై వంతెన కోసం నిరీక్షణ తప్పడం లేదు. మెట్ట ప్రాంతమైన తుని నియోజకవర్గంలో తుని రూరల్, కోటనందూరు మండలాల రైతుల ఆశలు ఆవిరిగానే మిగిలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం హామీలు ఇస్తున్న ఆ హామీలు నీటి మీద బుడగగానే మిగిలిపోతున్నాయని విచారం వ్యక్తం చేస్తున్నారు. బొద్దవరం, సుభద్రయమ్మపేట, కెఒ.అగ్రహారం, కొలిమేరు, సురవరంలో సుమారు 2,290 మంది రైతులు ఉన్నారు. వీరంతా చిన్నకారు రైతులు ఆయా గ్రామాల్లో 5,500 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, పచ్చిమిర్చి వంకాయలు, కాయగూరలతో పాటు వాణిజ్య పంటలైన అరటి, చెరకు, పామాయిల్, పంటలను సాగు చేస్తూ జీవనాన్ని సాగిస్తారు. వీరు వ్యవసాయం చేయడానికి తాండవ రిజర్వాయర్ నది దాటుకుని వెళ్ళాలి. ఈ నదిపై బ్రిడ్జి నిర్మించాలని 30 ఏళ్ల నుంచి ప్రజా ప్రతినిధులను, అధికారులను, నాయకులను అడుగుతున్నా బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టడం లేదన్నారు. 30 ఏళ్ల నుంచి పలుమార్లు జిల్లా కలెక్టర్లకు, మంత్రులకు వినతిపత్రాలు అందజేసినా బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టడం లేదన్నారు. 2023లో మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి, కాకినాడ ఎంపీ వంగ గీతకి విన్నవించుకోగా వెంటనే స్పందించి అప్పటి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లారు. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు రూ.10 కోట్లతో నిర్మాణానికి అంచనాలు రూపొందించారని స్థానిక సర్పంచ్ వేగి అప్పల నాయుడు తెలిపారు. నేటి వరకు నిర్మాణ పనులను ప్రారంభించకపోవడంపై స్థానిక రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి పండించిన పంటలను మార్కెట్‌కు తీసుకుని వెళ్లడానికి సరైన దారి మార్గం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు అన్నారు. తాండవ రిజర్వాయర్‌ను దాటుకుని వెళ్లలేక పామాయిల్, చెరుకు, పంటలను సాగు చేయడం మానేశామన్న రైతులు తెలిపారు. యడ్ల బళ్ళు, ట్రాక్టర్లతో నదిని దాటుకుని వెళ్లే దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి తాండవ రిజర్వాయర్ నదిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



తాండవ నదిపై తాటి చెట్టుతో రైతులు వేసుకున్న వంతెన

స్ట్రాంగ్ రూమ్ సందర్శించిన ఆర్ఒ

కాకినాడ : కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు శుక్రవారం జెఎన్‌టియుకె సివిల్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను సందర్శించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎఆర్ఒ చెల్లన్న దొర ఇతర అధికారులతో కలిసి స్ట్రాంగ్ రూమ్‌కు వెళ్లిన ఆయన అక్కడి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇవిఎంలకు మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. నిరంతరం పర్యవేక్షించేలా ఇద్దరు అధికారులను నియమించామని ఆర్ఒ తెలిపారు.